

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కిరణ్‌కుమార్ తదితరులు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషి

● మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ కిరణ్‌కుమార్

రాంనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు రాజ్యసభ సీటు, రెండు ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్ పదవులు ఇవ్వాలని కోరుతూ మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్‌కుమార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మాదిగల డిమాండ్లను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని, ప్రభుత్వంలో కీలక పదవులు ఇస్తామని హామీ ఇచ్చారు. పోకల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి హామీ మేరకు మాదిగలు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో మహా కూటమి ముఖ్య సలహాదారులు సంగీతపు రాజలింగం, మాస్టార్జీ, వి. నర్సింహ, లాయర్ మల్లన్న, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, ఆరేపల్లి రాజేందర్ తదితరులు ఉన్నారు.



రఘునాథ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

బీజేపీ ముషీరాబాద్ జాయింట్ కన్వీనర్‌గా రఘునాథ్

రాంనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్‌గా రాంనగర్ డివిజన్ నివాసి, బీజేపీ నగర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్న ఏ.ఎస్. రఘునాథ్ నియమితులయ్యారు. సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్. కె. లక్ష్మణ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. రఘునాథ్ మాట్లాడుతూ.. బీజేపీ పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో రుద్రహోమం

చిక్కడపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్‌లో ఆంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం రుద్రహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థాపిత దేవతాహోమం, హారతి, మంత్రపుష్పము, తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి ఆలయంలో హనుమత్ విజయ ఉత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. అభిషేకాలు, మన్యుసూక్తహోమం నిర్వహించారు. హస్తా నక్షత్రాన్ని పురస్కరించుకుని లక్ష్మీగణపతి స్వామివారికి శతకలశాభిషేకం నిర్వహించారు.



మాడభూషి శ్రీధర్ దంపతులను సత్కరిస్తున్న సత్యవాణి తదితరులు

మాడభూషి శ్రీధర్ దంపతులకు పురస్కారం

చిక్కడపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సంఘసేవకురాలు నడింపల్లి యమునా పాఠక్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో ఉగాది పురస్కారాలు-2024 ప్రదానం సభ సోమవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ మాడభూషి శ్రీధర్, వేదకళ్యాణి తదితరులకు అర్ధనారీశ్వరం, సేవా శ్రేష్ఠ అవార్డులు బహూకరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త జి. సత్యవాణి మాట్లాడుతూ.. వివిధ రంగాల వారిని ఎంపిక చేసి అవార్డులు ఇచ్చి వారిని సత్కరించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐ ఫోకస్ మిషన్ చీఫ్ కో-ఆర్డినేటర్ కె. వాసుదేవశర్మ, కె. హనుమంతరావు, జీఎస్ కుమారస్వామి, కె. సతీష్, తదితరులు పాల్గొన్నారు.



విజయలక్ష్మికి పురస్కారం అందజేస్తున్న దైవజ్ఞశర్మ తదితరులు

వర్ధమాన గాయనీమణులకు విజయలక్ష్మి స్ఫూర్తి

చిక్కడపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వర్ధమాన గాయనీమణులకు సింగింగ్‌స్టార్ విజయలక్ష్మి స్ఫూర్తిగా నిలుస్తారని సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ అన్నారు. శ్రీ మహాలక్ష్మి మెలోడీస్ ఆధ్వర్యంలో గాయని మహాలక్ష్మి సమర్పణలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో మధుర గాయని, కలైమామణి ఎస్.జానకి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ప్రముఖగాయని విజయలక్ష్మికి ఎస్. జానకి పురస్కారం, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ ఎక్సలెన్సీ అవార్డు ప్రదాన సభ ఈ సందర్భంగా జరిగింది. పురస్కారం, అవార్డును బహూకరించిన దైవజ్ఞశర్మ మాట్లాడుతూ.. విజయలక్ష్మి గానం ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. కార్యక్రమంలో ఓంకార్‌రాజు, లంక లక్ష్మీనారాయణ, గుదిబండి వెంకటరెడ్డి, వెంకట్‌రావు, మురళీధర్, వినోద్‌గౌడ్, నిర్వాహకుడు సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు. గాయనీగాయకులు ఆలపించిన గీతాలు శ్రోతలను ఆకట్టుకున్నాయి.

ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేష్



ఎర్రగడ్డ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బోటిక మహేష్ మాదిగ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆయనకు సోమవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎమ్మార్పీఎస్ పటిష్ఠతకు కృషి చేస్తానని తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని భర్త ఆత్మహత్య

జీడిమెట్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, భార్య చెప్పకుండా పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఇస్లాం(22) ఆరు నెలల క్రితం కుటుంబసభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. నగర శివారులోని అపర్ణ గ్రీన్‌హోమ్స్‌లో భవన నిర్మాణంలో రోజువారి కూలీగా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతంలో రేకుల షెడ్డు వేసుకుని ఉంటున్నాడు.

రెండు నెలల క్రితం ఇస్లాం భార్య అతడికి చెప్పకుండా పుట్టింటికి వెళ్లిపోయింది. ఆర్థిక ఇబ్బందులతోపాటు భార్య వెళ్లిపోయిందని మనస్తాపం చెందిన అతడు రేకుల షెడ్డులో ఉరేసుకున్నాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కార్మికులు, భవన నిర్మాణ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయంలో చోరీ కేసులో

ముగ్గురు నిందితుల అరెస్ట్

రూ. 6 లక్షల విలువగల సొత్తు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు (ముసుగులో ఉన్న వ్యక్తులు), వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

చిక్కడపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో ఓ దేవాలయంలో దేవతామూర్తులు, తిలకం, ఆభరణాలు, తాళిబొట్టు చోరీ చేసిన ముగ్గురు పాత నేరస్థులను చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఆరు లక్షల రూపాయల విలువైన చోరీ సొత్తుతోపాటు మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

సోమవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ రమేష్‌కుమార్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్‌ఐలు నాగరాజు, కోటేశ్వర్‌రావు, శశిపాల్‌రెడ్డి, మౌనికతో కలిసి వివరాలు వెల్లడించారు. గాంధీ ఆస్పత్రి ఫుట్‌పాత్‌పై నివసిస్తూ లేబర్ పని చేసే భూపాల్‌పల్లికి చెందిన పాత నేరస్థుడు పురాణం రాజశేఖర్(19) సెకండ్‌షో సినిమా చూసి వస్తూ ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో పంచముఖ హనుమాన్ దేవాలయంలో చోరీ చేయాలని భావించాడు. గత ఫిబ్రవరి 9వ తేదీ రాత్రి ఆలయం తలుపులు పగులగొట్టి వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి, గోదాదేవి, ఆభరణాలు, తిలకం, మంగళ సూత్రాలు, పంచలోహ విగ్రహాలు చోరీ చేశాడు. చోరీ సొత్తును ట్రాలీలో దాచిపెట్టగా భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఆసిఫ్(28), ఇస్మాయిల్ హుస్సేన్(23) దేవతామూర్తుల విగ్రహాలు తీసుకొని పారిపోయారు. వీరిద్దరినీ అదే నెల 23న పోలీసులు అరెస్ట్ చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం చిక్కడపల్లి మెట్రోస్టేషన్ వద్ద చోరీ చేసిన బైక్‌పై వెళ్తున్న ప్రధాన నిందితుడు పురాణం రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా.. నేరాన్ని అంగీకరించాడు. ముషీరాబాద్, చిక్కడపల్లి పీఎస్ పరిధుల్లో చోరీచేసిన మూడు బైక్‌లను నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తును అమ్మిన పాత నేరస్థులు భోలక్‌పూర్‌కు చెందిన ముబ్బాషిర్ మొయినుద్దీన్(23), మహ్మద్ ఖాలిద్ అహ్మద్(31)ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు నిందితుల నుంచి తిలకం, ఆభరణాలు, తాళిబొట్టు స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

హనుమాన్ శోభాయాత్రకు

300 మంది పోలీసులతో బందోబస్తు

చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్



హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా దోమలగూడ పీఎస్ పరిధిలో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ శోభాయాత్రకు 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎల్. రమేష్‌కుమార్ తెలిపారు. చిక్కడపల్లి, ముషీరాబాద్ పీఎస్‌ల పరిధిలో 2.5 కిలోమీటర్లు హనుమాన్ శోభాయాత్ర కొనసాగుతుందని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శోభాయాత్ర సాఫీగా సాగేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఏసీపీ తెలిపారు.

హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

రాంనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పీపుల్ అండ్ పీస్ కమిటీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సయ్యద్ ముక్తార్ హుస్సేన్ కోరారు. సోమవారం రిసాలగడ్డలో తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమాన్ శోభాయాత్రకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. శోభాయాత్ర సందర్భంగా తమ సంస్థ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాస్వామ్య రక్షణ కోసం పోరాడుదాం : సీపీఐ (ఎంఎల్)



మార్క్స్ భవన్‌లో సీపీఐ (ఎంఎల్) పార్టీ జెండా ఆవిష్కరణలో గ్రేటర్ కార్యదర్శి ఎం. హన్మేష్ తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆనాడు మితవాద, రివిజనిస్టు విధానాలకు వ్యతిరేకంగా 1969 ఏప్రిల్ 2న విప్లవ సిద్ధాంతం ఆవిష్కరించబడిందని, నేడు పాలకుల ప్రజా వ్యతిరేక విధానాల నేపథ్యంలో ప్రజాస్వామ్య రక్షణ కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎంఎల్) నేతలు పిలుపునిచ్చారు. సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో లెనిన్ జయంతి, సీపీఐ (ఎంఎల్) పార్టీ ఆవిర్భావం సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సూర్యం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సెక్రటేరియట్ సభ్యులు, గ్రేటర్ కార్యదర్శి ఎం. హన్మేష్, ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్షురాలు ఎస్. ఎల్. పద్మ మాట్లాడారు. లెనిన్ 154వ జయంతి, సీపీఐ (ఎంఎల్) పార్టీ ఆవిర్భావం చారిత్రకం అన్నారు. ప్రస్తుతం మాస్ లైన్‌లో విప్లవ సిద్ధాంతం ఆవిష్కరణ జరుగుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మతాన్ని రాజ్యాంగంలోకి తీసుకురావడం ద్వారా దేశం సర్వనాశనమవుతుందన్నారు.

ప్రజా ఉద్యమాల ద్వారానే ఫాసిస్టు ప్రమాదాన్ని ఓడించగలం



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జేవీ చలపతిరావు

రాంనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథానే భారతదేశానికి విముక్తి మార్గం అని, ప్రజా ఉద్యమాల ద్వారానే దేశంలో ఫాసిస్టు ప్రమాదాన్ని ఓడించగలమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జె. వి. చలపతి రావు అన్నారు.

సోమవారం విద్యానగర్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యాలయంలో అరుణ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. నాడు దొరలు, భూస్వాములు, పెట్టుబడిదారులు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించిన చరిత్ర విప్లవోద్యమానికి ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, నాయకురాలు అరుణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి. మహేష్, నాయకులు గడ్డం శ్యామ్, శ్రీను, మల్లయ్య, ప్రమీల, గౌతమ్, గణేష్, సత్యనారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కాలేజీల ఫీజుల దోపిడీని అరికట్టాలి



విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్. కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ జూనియర్ కాలేజీలు, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం కృష్ణయ్య నాయకత్వంలో బీసీ సంఘాల నేతలు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు వినతిపత్రం అందజేశారు.

ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. కార్పొరేట్ కాలేజీలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేసి పేదలను దోచుకుంటున్నాయని ఆరోపించారు ఇంటర్మీడియట్‌కు రూ. 3 లక్షల నుంచి రూ. 3.50 లక్షల వరకు వసూలు చేస్తున్నారని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేశామన్నారు. పాఠశాల స్థాయి విద్యకు 3 నుంచి 4 లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని వాపోయారు. ఇంటర్‌తోపాటు నీట్, జేఈఈ, లాంగ్‌టర్మ్, షార్ట్ టర్మ్‌లకు కూడా అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఒక్క కాలేజీ, పాఠశాలకు పర్మిషన్ తీసుకుని అదనంగా అనేక కాలేజీలు, పాఠశాలలు కొనసాగిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అడ్మిషన్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయకముందే కాలేజీలు ముందస్తు అడ్మిషన్లు తీసుకుని కోట్లాది రూపాయలు దండుకుంటున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలల నిర్వాకం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కాలేజీలపై చట్టప్రకారం కేసులు నమోదు చేయకపోతే బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు పెరిక సురేష్, నీల వెంకటేష్, రాజేందర్, వేముల రామకృష్ణ, నందగోపాల్, రాందేవ్, చంద్రశేఖర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు, ఆటోల్లో నిద్రిస్తున్న వారే టార్గెట్

● దొంగతనాలు చేస్తున్న ముగ్గురి అరెస్ట్

● రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జగన్

రాంనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాత్రివేళ ఫుట్‌పాత్‌లు, ఆటోల్లో నిద్రిస్తున్న వారిని టార్గెట్ చేసుకుంటూ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను నల్లకుంట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి కత్తి, త్రిశూల్, బ్లేడ్, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, రూ. 1,600 స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నల్లకుంట పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓయూ ఏసీపీ జగన్ నల్లకుంట సీఐ జగదీశ్వర్‌రావు లాలాగూడ సీఐ రమేష్‌గౌడ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు.

బోరబండ, ఎర్రగడ్డ ప్రాంతాల్లో నివసిస్తున్న కల్మేర రమేష్, పెండల వెంకటస్వామి, కమ్మగోని కార్తీక్‌గౌడ్ ముఠాగా ఏర్పడ్డారు. రాత్రివేళ రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లు, ఆటోలలో నిద్రిస్తున్న వ్యక్తులను బెదిరించి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, డబ్బులు, వాహనాలను దొంగిలిస్తున్నారు. వాటిని అమ్మి జల్సా చేస్తున్నారు. రాయదుర్గం ఆజుబా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న ఎస్. నందకుమార్ ఈనెల 13వ తేదీ రాత్రి మద్యం తాగి బైక్‌పై వెళ్తున్నాడు. మెట్టుగూడ మెట్రో స్టేషన్ వద్దకు వెళ్లగానే బైక్ నడపడం వీలుకాకపోవడంతో బస్టాప్‌లో బైక్ పార్క్ చేసి నిద్రపోయాడు. కొద్దిసేపటి తర్వాత లేచి చూడగా పార్క్ చేసిన బైక్. జేబులో సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 17న తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో రమావత్ రాజు అనే వ్యక్తి నల్లకుంట మోడల్ రైతు చికెన్ బజార్ వద్ద ఫుట్‌పాత్‌పై నిద్రపోయాడు. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు యాక్టివాపై వచ్చి అతడిని కత్తితో బెదిరించి కీ ప్యాడ్, మొబైల్, రూ. 3 వేలు అపహరించారు. బాధితుడు నల్లకుంట పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బోరబండలో కల్మేర రమేష్, పెండల వెంకటస్వామి, కమ్మగోని కార్తీక్‌గౌడ్‌ను పట్టుకున్నారు. ముగ్గురూ మూడేళ్ల నుంచి దొంగతనాలు చేస్తున్నారని ఏసీపీ తెలిపారు. వెంకటస్వామి 16 నెలలు జైలుశిక్ష అనుభవించాడు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మరలా దొంగతనాలు చేస్తున్నాడని తెలిపారు. ఎస్ఆర్‌నగర్, లాలాగూడ, నల్లకుంట, జీడిమెట్ల, కూకట్‌పల్లి పీఎస్‌ల పరిధిలో చోరీలు చేశారన్నారు. వీరిపై ఆర్మ్ యాక్ట్ నమోదు చేశామని చెప్పారు. సమావేశంలో ఎస్‌ఐలు కృష్ణ, శ్రీనివాసరావు, రమాదేవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందికి రివార్డు ఇవ్వనున్నట్లు ఏసీపీ జగన్ ప్రకటించారు.



దానం నాగేందర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ గెలుపునకు నాయకులు సమష్టిగా పనిచేయాలి

రాంనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ సూచించారు. అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు తొలుపునూరి కృష్ణగౌడ్, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులి జగన్, గరిగంటి రమేష్ తదితరులు దానం నాగేందర్‌తో సోమవారం సమావేశమయ్యారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్‌కుమార్, శ్రీమంత్‌గిరి, నరేష్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, బండ సూరి తదితరులు పాల్గొన్నారు.



షార్ట్ ఫిలిం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

లఘు చిత్రాలను ప్రజలు ఆదరించాలి

● ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సామాజిక దృక్పథంతో నిర్మించే లఘు చిత్రాలను ప్రజలు ఆదరించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. కె. నితీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇటలీ పేరుతో నిర్మించిన షార్ట్ ఫిల్మ్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిజమైన ప్రేమ కథను ఆధారంగా తీసుకొని రూపొందించిన ఈ సినిమా ప్రజాదరణ పొందాలని ఆకాంక్షించారు. ప్రేమ పేరుతో సూసైడ్ చేసుకోవడం మానుకోవాలని, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో ఫిల్మ్ నిర్వాహకులు రాజా దీన్‌దయాల్ రెడ్డి, నవీన్‌కుమార్, మనోజ్‌గౌడ్, ప్రసాద్, సాయికిరణ్, జెస్టిన్, అఖిలేష్, సుజిత్, ప్రవీణ్, హేమా చక్రధర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అన్నపూర్ణనగర్ బస్తీలో సమస్యల పరిష్కారానికి కృషి

గోల్నాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అన్నపూర్ణనగర్ బస్తీలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సోమవారం పర్యటించారు. బస్తీలో సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గండికోట జనార్దన్, రుద్రయ్య పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం : పద్మారావుగౌడ్

కవాడిగూడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ ఆరోపించారు. లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి సోమవారం కవాడిగూడ కొత్తబజార్‌లో సంకట విమోచన హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కొత్తబజార్, మసీదు గల్లీ, పతంగ్ బిల్డింగ్, శివాజీచౌక్, తాళ్లబస్తీ, ఉన్నికోట ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. బీజేపీ కాంగ్రెస్ ఎన్ని కుట్రలు పన్నినా బీఆర్ఎస్ గెలుపును అడ్డుకోలేవన్నారు.

ప్రచారంలో నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నగర నాయకులు వల్లాల శ్రీనివాస్‌యాదవ్, బండ జుగేందర్, రాజశేఖర్‌గౌడ్, రాజుయాదవ్ తదితరులు పాలొగన్నారు.

నేటి నుంచి బైబిల్ తరగతులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో మంగళవారం నుంచి 12 రోజులపాటు పిల్లలు, యువతీయువకులకు బైబిల్ తరగతులు నిర్వహిస్తున్నామని హెబ్రోన్ సొసైటీ చైర్మన్ జోసెఫ్ పి. కురియన్, సొసైటీ ప్రధానకార్యదర్శి, సొసైటీ ఆఫ్ ట్రస్టీస్ ఆఫ్ ఇండిజీనస్ చర్చస్ ఇన్ ఇండియా ప్రధాన కార్యదర్శి రాగి వీరాచారి తెలిపారు. వచ్చేనెల 4వ తేదీ వరు ప్రతిరోజూ ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు.